ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

శనివారం | మే 09, 2026 | సంపుటి : 6 | సంచిక : 340 | పేజీలు : 2

రేపు పీఎం సభను జయప్రదం చేయండి

- సభకు భారీగా తరలి రావడానికి సిద్ధమవుతున్నారు..
- మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ

2 లో

మూసీ ప్రాజెక్టు..తొలిదశలో రూ.7,055 కోట్లతో పనులు

మూసీ ప్రాజెక్టుపై చర్చించేందుకు మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. డీపీఆర్ వివరాలను మంత్రులకు అధికారులు అందజేశారు. తొలిదశలో చేపట్టే పనులకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ)తో చర్చలు ముగిశాయని ఉపసంఘానికి తెలిపారు. తొలిదశలో రూ.7,055 కోట్లతో మూసీ ప్రాజెక్టు పనులు జరగనున్నాయి. నిర్మాణాలపై ప్రభావం లేని 5.కి.మీ మేర పనులు ప్రారంభించాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. నిర్మాణాలపై తక్కువ ప్రభావం పడేలా అలైన్‌మెంట్ మార్చాలని మంత్రులు సూచించారు. మూసీ ప్రాజెక్టు పనులను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించి 2027 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా చేపట్టాలన్నారు. వర్షాకాలంలో పనులకు ఆటంకం లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మూసీపై రబ్బర్ డ్యామ్ నమూనాలను ఈ సందర్భంగా ఉపసంఘం పరిశీలించింది.

హైదరాబాద్, ఆయుధం:

యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- నిత్య విద్యార్థిగా ఉంటేనే జీవితంలో మరింత ఎదుగుదల
- రాయిని పదును పెడితేనే డైమండ్ అవుతుంది
- యువతకు ఫిజికల్ హెల్త్‌తో పాటు మెంటల్ హెల్త్ కూడా ముఖ్యం
- ఒక జాబ్ కాకపోతే మరో అవకాశం కోసం ప్రయత్నించాలి
- ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు స్టార్టప్స్, వ్యాపారాలపై దృష్టి పెట్టాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హనుమకొండ, ఆయుధం: యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. హనుమకొండలోని కాళోజి కళాక్షేత్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మెగా జాబ్ మేళాలో రాష్ట్ర పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, శాసనసభ్యులు కె ఆర్. నాగరాజు తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాలో ఏర్పాటు చేసిన 72 ప్రముఖ కంపెనీల స్టాల్స్ ను ఎంపీ సందర్శించారు. వివిధ విభాగాల్లో ఖాళీల భర్తీకి ముందుకు రావడం సంతోషకర విషయమన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ...ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ రంగంలో గడ్డుకాలం నడుస్తోందన్నారు. టాలెంట్, హార్డ్‌వర్క్ ఉన్నప్పటికీ అనేక దేశాల్లో ఉద్యోగ భద్రత సవాల్‌గా మారిందని పేర్కొన్నారు. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం ఉదయం లేచేసరికి మిగతా 2లో..

పుట్ట రాకేష్ కు మంత్రి సురేఖ పరామర్శ

వరంగల్, ఆయుధం: ఖిలా వరంగల్ పడమర కోటలో రెండు కిడ్నీలు ఫెయిల్ అయి ఇబ్బంది పడుతున్న పుట్ట రాకేష్, కుటుంబ సభ్యులను మంత్రి కొండా సురేఖ శుక్రవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ కిడ్నీ మార్పిడి చికిత్స కోసం సీఎం రేవంత్ రెడ్డి తో మాట్లాడి చికిత్స అందించేందుకు సహకారం చేస్తానని అన్నారు. కుటుంబ సభ్యులు అధైర్య పడవద్దని సూచించారు.

ఆదాయ వనరుల పెంపుతోనే స్థానిక సంస్థల బలోపేతం

- సెంట్రల్ తెలంగాణ ప్రాంతీయ సదస్సులో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా గ్రామాలు, పట్టణాల సమగ్ర అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే నాగరాజు

హనుమకొండ, ఆయుధం: స్థానికంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఆదాయ వనరులను పెంపొందించేందుకు స్థానిక సంస్థలు అంకితభావంతో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. హనుమకొండలో నిర్వహించిన సెంట్రల్ తెలంగాణ స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సులో ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు, రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి కాత్యాయని, సభ్యుడు ఎస్.సుధీర్ రెడ్డిలతో కలిసి చైర్మన్ సిరిసిల్ల రాజయ్య స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. సెంట్రల్ తెలంగాణ జిల్లాల అదనపు కలెక్టర్లు తమ తమ జిల్లాలలో స్థానిక సంస్థల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆదాయ వనరులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, తడి-పొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధి పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు చేపడుతున్న చర్యలపై అధికారులు వివరించారు. అలాగే గ్రాంట్లు, స్థానిక ఆదాయ వనరులు, ఇతర మార్గాల ద్వారా లభిస్తున్న రాబడిపై సమగ్ర నివేదికలను సమర్పించారు.

ఈ సందర్భంగా చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ "గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యం" అనే భావనతో స్థానిక సంస్థలు పనిచేయాలని సూచించారు.

అనవసర వ్యయాలను తగ్గించి, స్వీయ ఆదాయాన్ని పెంచుకున్నప్పుడే ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడంతో పాటు వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలను ప్రజాస్వామ్య పరిపాలనలో భాగస్వామ్యం చేస్తూ వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఆదాయ వనరుల అభివృద్ధితో పాటు శాస్త్రీయ దృక్పథంతో ప్రణాళికలు అమలు చేస్తేనే పల్లె, పట్టణ ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డులో రక్షిత మంచినీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ సమర్థవంతంగా కొనసాగేందుకు స్థానిక సంస్థలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఇటీవల ఎన్నికైన సర్పంచులు, మేయర్లు, చైర్‌పర్సన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించాలని కోరారు.

స్థానిక సంస్థలు పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులపై ఆధారపడకుండా పన్ను వసూళ్లు, ప్రకటనల రుసుములు, వృత్తి పన్ను, వ్యాపార-వాణిజ్య సముదాయాల ఫీజులు తదితర మార్గాల ద్వారా ఆదాయాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఆదాయ వనరుల విస్తరణకు సంబంధించి ప్రజా ప్రతినిధులు, అధికారుల నుండి సూచనలు స్వీకరించి, వాటిని సమగ్రపరచి ప్రభుత్వానికి నివేదిక రూపంలో సమర్పిస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా గ్రామాలు, పట్టణాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే స్థానిక సంస్థలకు తగిన నిధులు, అధికారాలు, వనరులు కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్య, వైద్యం, తాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో పారదర్శకత, బాధ్యతాయుత విధానం ఉండాలని, ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరేలా ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. సదస్సులో సెంట్రల్ తెలంగాణ జిల్లాల అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈఓలు, డీపీఓలు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, కమిషనర్లు, డీఎల్పీఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, అధికారులు పాల్గొన్నారు.

చెరువుల సంరక్షణతో మత్స్య ఉత్పత్తి పెంపు సాధ్యం

- మత్స్యకారులకు జిల్లా స్థాయి అవగాహన సదస్సు
- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

హనుమకొండ, ఆయుధం: ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న "రైతు వారం" ఐదవ రోజు సందర్భంగా చెరువులలో కలుపు మొక్కల నివారణ, చేపల వ్యాధుల నియంత్రణ, చేపల అధికోత్పత్తి సాధనపై జిల్లా స్థాయి అవగాహన సదస్సు జరిగింది.

తమిళనాట తొలగిన అనిశ్చితి

- విజయ్‌కు కమ్యూనిస్టులు, వీసీకే మద్దతు!
- ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్ సిద్ధం
- మ్యాజిక్ నంబర్ సాధించిన టీవీకే

జాతీయం, ఆయుధం: తమిళనాడు రాజకీయాలు మరింత రసవత్తరంగా మారుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ టీవీకేకు మద్దతు ప్రకటించగా, తాజాగా వీసీకే, సీపీఐ, సీపీఐ(ఎం) పార్టీలు కూడా సపోర్టు చేస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో తమిళనాడులో నెలకొన్న రాజకీయ అనిశ్చితికి తెరపడనుంది. గత కొన్ని రోజులుగా తమిళనాడులో రాజకీయ అనిశ్చితి కొనసాగుతోంది. విజయ్ తన తొలి అసెంబ్లీ ఎన్నికల్లోనే (108) సీట్లు సంపాదించుకున్నారు. కానీ ప్రభుత్వ ఏర్పాటుకు 118 సీట్లు అవసరం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ (5సీట్లు), డీఎంకే నుంచి విడిపోయి విజయ్ పార్టీకి మద్దతు ఇచ్చింది. కానీ మ్యాజిక్ ఫిగర్ సాధించడానికి మిగతా 2లో..

చిన్న జీవితాలకు.. ఆపదొచ్చింది

- క్యాన్సర్ తో పోరాడుతున్న మౌనిక
- ఆదుకోవాలని దంపతుల వేడుకోలు

వరంగల్, ఆయుధం: వరంగల్ కు చెందిన మధుసూదన్, మౌనిక దంపతులది ఇద్దరు పిల్లలతో సాగిపోతున్న చిన్న ప్రపంచం. ఇద్దరూ ప్రైవేటు ఉద్యోగులుగా పని చేస్తూ నెట్టుకొస్తున్న జీవితాల్లో పెద్ద కుదుపు. అనూహ్యంగా మౌనిక(32)కు క్యాన్సర్ మహమ్మారి ఆవహించింది. లక్షలు ఖర్చు అయ్యే ఈ వ్యాధితో పోరాడుతూ ఆర్థికంగా, మానసికంగా ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నది. ప్రస్తుతం మౌనిక హైద్రాబాద్ లోని ఒమేగా ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నది. క్యాన్సర్ మూడవ స్టేజ్ లో ఉండడం వల్ల లక్షల్లో ఖర్చు చెయ్యాల్సి వస్తున్నది. ఇద్దరు పిల్లల పోషణ, మౌనిక ఆరోగ్య పరిస్థితితో మధుసూదన్ తప్పని పరిస్థితి లో సహాయం కోసం అర్థిస్తున్నారు.

వారికి ఎలాంటి ఆర్థిక ఆధారం లేకపోవడం వల్ల దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఒక చిన్న సాయం కుటుంబాన్ని నిలబెడుతుంది. సహాయం చెయ్యాలి అనుకునే వారు మధుసూదన్ 9398711733 కి ఫోన్ పే లేదా గూగుల్ పే చెయ్యాలని వేడుకుంటున్నారు.

అధికారులు సమన్వయంతో జిల్లాను అగ్రగామిగా నిలపాలి

- జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం
- అక్షర మాలలో వెలిగిన ములుగు జిల్లా
- పదో తరగతి ఫలితాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం
- రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క

ములుగు, ఆయుధం: జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ముఖ్య లక్ష్యంగా, అధికారుల సమన్వయంతో ములుగు జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలని, ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ములుగు జిల్లా అక్షర మాలలో వెలిగి ఇతర జిల్లాలకు ఆదర్శప్రాయంగా నిలవడం గర్వకారణంగా ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, డి ఎఫ్ ఓ వికాస్ మీనా లతో కలిసి జిల్లా అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి,ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాలలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను శాలువలతో సన్మానించారు.

జిల్లాలో అభివృద్ధి పనులపై అన్ని శాఖల ఉన్నత అధికారులతో పురోగతిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధిని సాధించడంతో పాటు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందని, ఇందులో భాగంగా ప్రజా దర్బార్ ద్వారా ప్రజల సమస్యలను నేరుగా పరిష్కరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల స్థితిగతులపై పూర్తిస్థాయిలో ప్రత్యేక అధికారిని నియమిస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో క్లియర్ చేయడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. నూతన గ్రామపంచాయతీ భవనాలకు అంచనాలను సిద్ధం చేసి యుద్ధ ప్రతిపాదికన పూర్తిచేయాలని, గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. మౌలిక వసతులైనటువంటి కరెంటు, డ్రైనేజీ, తాగునీటి వంటి అత్యవసర పనులకు మాత్రమే నిధులకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, వసతి గృహాలు పునఃప్రారంభం అయ్యేలోపు వాటిలోని సమస్యలను మరమ్మత్తు పనులను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. అటవీ ప్రాంతాలలో ఉండే గ్రామాలలో కనీస సౌకర్యాల విషయంలో అటవీ అధికారులు గిరిజనులను ఇబ్బందులకు గురి చేయవద్దని త్వరలోనే ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అంతరించిపోయే వృక్షజాతులు, వివిధ రకాల పండ్ల మొక్కలతో ప్రత్యేకంగా పార్క్ ఏర్పాటు చేసే విధంగా చూడాలని, ఎక్కువ సంఖ్యలో ఇప్ప చెట్లను పెంచే విధంగా చూడాలన్నారు.

మేడారం మహా జాతరలో అద్భుతాలు సృష్టించిన మహిళా సంఘాల సభ్యులు అదే స్ఫూర్తితో రాబోయే గోదావరి పుష్కరాలకు కూడా ప్రత్యేక స్టాల్స్ నిర్వహించుకోవడానికి ముందుకు రావాలని డి ఆర్ డి ఏ ద్వారా వారికి సహాయ సహకారాలు ప్రోత్సాహం అందించడం జరుగుతుందని తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులను అప్రమత్తంగా ఉండే విధంగా సూచనలు జారీ చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఉద్దేశిస్తూ మంత్రి మాట్లాడుతూ అక్షరమాలలో ములుగు జిల్లాను ర్యాంకులతో వెలిగించినందుకు కృషిచేసిన విద్యార్థులను, తల్లిదండ్రులను ఉపాధ్యాయులను, అధికారులను అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు ఉండే డిమాండ్ కలిగిన మంచి సబ్జెక్టులలో ఉన్నత విద్యను అభ్యసించాలని, అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుతూ తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమంలో వస్తున్న దరఖాస్తులు, ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో వస్తున్న దరఖాస్తుల విషయంలో క్రమం తప్పకుండా ప్రతి మూడు రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించడం జరుగుతుందని తద్వారా ఫిర్యాదుదారులకు జవాబుదారితనం లభిస్తుందని పేర్కొన్నారు.

అన్ని శాఖల వారీగా పెండింగ్లో ఉన్న ఫైల్స్ వెంటనే క్లియరెన్స్ చేసుకోవాలని అధికారులు తూ.చా తప్పకుండా సమయపాలన పాటిస్తూ సమన్వయంతో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్లడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్. జి, ఆర్డీవో వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓ లు, ఎంపిఓ లు, తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి..)

ఉద్యోగం కోల్పోయామని తెలిసే పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. ఇలాంటి సమయంలో యువత నిరాశ చెందకుండా నిరంతరం తమ నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. తాను కూడా ప్రైవేట్ రంగంలో డాక్టర్‌గా పనిచేసి, అనంతరం ప్రభుత్వ ఉద్యోగం సాధించి, ప్రస్తుతం ప్రజాప్రతినిధిగా సేవలందిస్తున్నానని తెలిపారు..ఎంబీబీఎస్ చదివిన కారణంగా పార్లమెంటులో ప్రవేశపెట్టే బిల్లులు, దేశవ్యాప్తంగా అమలు చేసే విధానాలపై లోతైన అవగాహన ఏర్పడిందన్నారు. ఒక బిల్లును ప్రవేశపెట్టే ముందు అనేక కోణాల్లో చదివి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తా మన్నారు.

విద్యార్థి దశ ముగిసిన తర్వాత కూడా ప్రతి ఒక్కరూ "నిత్య విద్యార్థి"గా ఉండాలని, నిరంతరం చదువుకుంటూ కొత్త విషయాలు నేర్చుకుంటూ ఉంటేనే జీవితంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోగలరని అన్నారు. ఉద్యోగం పచ్చిన తర్వాత కూడా ఎదుగుదల కోసం చదువు ఆగకూడదని, "రాయిని పదును పెడితేనే డైమండ్ అవుతుంది" అంటూ యువతలో ఆత్మవిశ్వాసం నింపారు.

ప్రస్తుతం యువతకు ఫిజికల్ హెల్త్‌తో పాటు మెంటల్ హెల్త్ కూడా ఎంతో ముఖ్యమని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. "ప్రపంచంతో యుద్ధం చేస్తే అలెగ్జాండర్.. నీతో నువ్వు యుద్ధం చేస్తే బుద్ధుడు" అనే వ్యాఖ్యను ఉదహరిస్తూ మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతిరోజూ మెడిటేషన్, పాజిటివ్ థింకింగ్ అలవాటు చేసుకుంటే మానసికంగా దృఢంగా మారి భవిష్యత్తులో విజయాలు సాధించగలరని తెలిపారు. జీవితం చాలా చిన్నదని, కానీ ప్రయత్నం మాత్రం ఎప్పటికీ ఆగకూడదన్నారు. ఒక ఉద్యోగం రాకపోతే మరో అవకాశానికి సిద్ధంగా ఉండే ధైర్యం యువతలో ఉండాలని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితం కాకుండా స్టార్ట్ప్స్, వ్యాపారాలు, ప్రైవేట్ రంగం, ఇతర ఉపాధి అవకాశాల వైపు కూడా యువత ఆలోచించాలని సూచించారు. జాబ్ మేళాకు హాజరైన ప్రతి యువకుడికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, తమ లక్ష్యాలను సాధించే దిశగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఎంపీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య శారద, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు పీఎం సభను సక్సెస్ చేయండి

- **బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ**
- **సభకు భారీగా తరలి రావడానికి సిద్ధమవుతున్నారు..**
- **మోదీ సభ నేపథ్యంలో మీడియా సమావేశం..**
- **రెండు లక్షల మందిని తరలించేందుకు ఏర్పాట్లు: జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్**
- **స్వచ్ఛందంగా ప్రజలే తరలి వస్తారు... రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు**

వరంగల్, ఆయుధం: ఈ నెల 10 తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ప్రధాని నరేంద్ర మోదీ సభకు ప్రజలు స్వచ్ఛందంగా భారీగా తరలడానికి ఉత్సాహం చూపుతున్నారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ అన్నారు. మోదీ సభకు ప్రజలను సమాయత్తం చేసే విషయమై శుక్రవారం వరంగల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ అధ్యక్షతన వరంగల్ ఎల్ బీ నగర్ లోని రయాన్ ఫంక్షన్ హాల్ లో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజధానిలో నిర్వహించనున్న ప్రధాని సభకు రాష్ట్ర పార్టీ సారథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లు, జిల్లా నుంచి జనసమీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి అనంతరం మీడియాతో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకట రమణ మాట్లాడుతూ మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి తెలంగాణ గడ్డపై కాలుపెట్టబోతున్న పీఎం మోదీకి ఘనస్వాగతం పలకడానికి ప్రజలు తండోపతండాలుగా తరలి రావడానికి ఉవ్విళ్లూతున్నారు. రాష్ట్ర అభివృద్ధికి మోదీ నాయకత్వంలోని బీజేపీ సర్కార్ విడుదల చేస్తున్న నిధుల వరద, చకచకా సాగుతున్న పనులపై సంతోషంగా ఉన్న జనం తమ కృతజ్ఞతలు తెలిపి సభను విజయవంతం చేయడానికి కంకణం కట్టుకున్నారని తెలిపారు. దేశ సమగ్రతకు శక్తివంచన లేకుండా శ్రమిస్తున్న ప్రధాని నరేంద్రమోదీకి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించడానికి పార్టీలకు అతీతంగా, కులమతభేదాలకు అస్కారం లేకుండా జనం రాబోతున్నారని వెంకటరమణ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీ పక్షాన నిలిచిన విధానం సంతోషంగా ఉందని, రాబోయే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీకే పట్టం దక్కడం ఖాయమని వెంకట రమణ ధీమా వ్యక్తం చేశారు. కాగా, వరంగల్ జిల్లాకు ఇప్పటికే మెగా టెక్స్ టైల్ పార్క్ కోసం బీజేపీ సర్కార్ నిధులు విడుదల చేసిందని గుర్తు చేశారు. అలాగే కాజీపేటవిజయవాడ మూడో లైన్ పనులు, ఉమ్మడి జిల్లా కేంద్రం మీదుగా వెళ్తున్న జాతీయరహదారులకు మోదీ శంకుస్థాపన చేయనున్నారు.

రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ ప్రజలంతా ప్రధాని మోదీ పనులకు ఆకర్షితులై స్వచ్ఛందంగా మద్దతు తెలపడానికి రాబోతున్నారని తెలిపారు. ప్రధాని సభలో వరంగల్ జిల్లా బలాన్ని చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని, పార్టీలకు అతీతంగా ప్రధానికి వెన్నుదన్నుగా నిలవడానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిద్ధం నరేష్, రాష్ట్ర నాయకులు మార్టిన్ లూథర్, మురళీకృష్ణ, మాదాసు రాజు, సతీశ్ షా , సముద్రాల పరమేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్, గదల కుమార్, కార్యదర్శిలు కపిల్, వెంకట్రావు, రఘునాథ్ రెడ్డి, కాశీబుగ్గ అధ్యక్షులు అపురూప రజనీష్ పాల్గొన్నారు.

రెండు లక్షల మందిని తరలిస్తాం

- **బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్**

ఈ నెల 10వ తేదీన పరేడ్ గ్రౌండ్ లోజరుగనున్న ప్రధాని నరేంద్ర మోదీ సభకు వరంగల్ జిల్లా నుంచి సుమారు రెండు లక్షల మంది తరలనున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ తెలిపారు. ఈ మేరకు కాజీపేట సహా ఖమ్మం, పెద్దపల్లి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లతో పాటు బస్సులను కూడా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. జిల్లా ప్రజల ఉత్సాహం చూసి మరిన్ని ఏర్పాట్లు కూడా చేస్తున్నట్టు చెప్పారు. ప్రజలంతా ప్రధాని మోదీకి మద్దతుగా నిలవడానికి భారీగా తరలుతారని ఆశిస్తున్నట్టు రవికుమార్ పేర్కొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

- **వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్**

హనుమకొండ, ఆయుధం: ఉద్యోగంలో స్థాయి పెరిగిన కొద్దీ బాధ్యతలు కూడా పెరుగుతాయని, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల ఏఎస్సై స్థాయి నుంచి సబ్ ఇన్‌స్పెక్టర్‌లుగా పదోన్నతి పొందిన 25 మంది అధికారులు శుక్రవారం పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పదోన్నతి పొందిన ఎస్.ఐ భుజాలపై నక్షత్ర చిన్నహాలను అలంకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పదోన్నతులు కేవలం హోదా పెరుగుదల మాత్రమే కాకుండా ప్రజల పట్ల మరింత బాధ్యతతో పనిచేసే అవకాశం అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సానుభూతితో వినడం, చట్టపరంగా వేగవంతమైన చర్యలు తీసుకోవడం, పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచే విధంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ విధానాన్ని అవలంబిస్తూ, బాధితులకు తక్షణ సహాయం అందించాలన్నారు. కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి అధికారి కీలక పాత్ర పోషించాలని, విధుల్లో క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధతతో పనిచేయాలని ఆయన సూచించారు. నూతనంగా పదోన్నతి పొందిన అధికారులు తమపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సీపీ తెలిపారు.

చెరువుల సంరక్షణతో మత్స్య ఉత్పత్తి పెంపు సాధ్యం

- **మత్స్యకారులకు జిల్లా స్థాయి అవగాహన సదస్సు**
- **కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

హనుమకొండ, ఆయుధం: ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న "రైతు వారం" ఐదవ రోజు సందర్భంగా చెరువులలో కలుపు మొక్కల నివారణ, చేపల వ్యాధుల నియంత్రణ, చేపల అధికోత్పత్తి సాధనపై జిల్లా స్థాయి అవగాహన సదస్సు శుక్రవారం హనుమకొండలోని పద్మనగర్ పద్మశాలి భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... మత్స్య సంపద అభివృద్ధితో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. చెరువుల పరిశుభ్రత, నీటి నాణ్యత పరిరక్షణ, చేపల వ్యాధుల నివారణ చర్యలు సమర్థవంతంగా అమలు చేస్తే మత్స్య ఉత్పత్తి పెరిగి మత్స్యకారులకు అధిక ఆదాయం లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి పి.శ్రీపతి మాట్లాడుతూ ఆధునిక మత్స్య సాగు పద్ధతులు, చెరువుల నిర్వహణ, చేపల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ వ్యవసాయ శాఖ స్పెషల్ ఆఫీసర్ నీలం పుష్పరాణి, ముమునూర్ కేవీకే శాస్త్రవేత్త డా. గణేష్ (ఆక్వాకల్చర్), ఎఫ్‌డీఓ (రిటైర్డ్) ఎస్. వేణుగోపాల్, డీఎఫ్‌సీఎస్ హనుమకొండ బుస్స మల్లేశం తదితరులు చేపల ఉత్పత్తి పెంపు, వ్యాధుల నివారణ, సాంకేతిక పద్ధతుల వినియోగంపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు. ఈ ఈ అవగాహన సదస్సుకు సంబంధిత శాఖల అధికారులు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి మత్స్యకారులు హాజరయ్యారు.

ఈవీఎం గోదాంల తనిఖీ

హన్మకొండ, ఆయుధం: నెలవారి తనిఖీల్లో భాగంగా హన్మకొండ రెడ్ క్రాస్ భవనం వెనుక గల ఈ.వి.ఎం. గోడౌన్ ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అదనపు కలెక్టర్ ఎన్. రవి తో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గోడౌన్ రూం సీల్ ను పరిశీలించి, భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, భద్రతా సిబ్బంది షిఫ్టుల వారీగా డ్యూటీలో ఖచ్చితంగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు జగత్ సింగ్, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

ఇండీ కూటమికి డీఎంకే గుడ్‌బై

జాతీయం, ఆయుధం: ఇండీ కూటమికి డీఎంకే గుడ్‌బై చెప్పింది. ఇక కాంగ్రెస్‌తో తమ పొత్తు ముగిసినట్లు వెల్లడించింది. తమకు లోక్‌సభలో ప్రత్యేక సీట్లు కేటాయించాలని స్పీకర్‌కు డీఎంకే ఎంపీ కనిమొళి తాజాగా లేఖ రాశారు. కాంగ్రెస్ ఎంపీల పక్కన కూర్చోలేమని అందులో పేర్కొన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత టీవీకేకు కాంగ్రెస్ మద్దతు తెలపడంతో డీఎంకే ఈ నిర్ణయం తీసుకుంది.

తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకేకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించడంపై డీఎంకే ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నుంచి ఆ పార్టీ వైదొలగడాన్ని ఖండించారు. కూటమికి కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచి ద్రోహం చేసిందని.. పాత రాజకీయ స్వభావాన్ని ఆ పార్టీ మార్చుకోలేదని ఆక్షేపించారు. కూటమి వల్లే కాంగ్రెస్‌కు రాజ్యసభ ఎంపీ, అసెంబ్లీ సీట్లు వచ్చాయన్నారు. కాంగ్రెస్ ద్రోహాన్ని అధిగమించి బలమైన ప్రతిపక్షంగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నిర్ణయాన్ని ఉత్తర్‌ప్రదేశ్‌లోని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సైతం వ్యతిరేకించారు. స్వలాభాల కోసం కూటమి నేతలను వదులుకోవడం సరైన చర్య కాదన్నారు

తమిళనాట తొలగిన అనిశ్చితి

(మొదటి పేజీ తరువాయి..)

ఇది సరిపోలేదు. ఈ నేపథ్యంలో గవర్నర్ టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు ససేమిరా అన్నారు. దీనితో రాజకీయ అనిశ్చితి ఏర్పడింది. మరోవైపు డీఎంకే, ఏఐఏడీఎంకే కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేస్తాయనే ఊహాగానాలు వెలువడ్డాయి. దీనితో పరిస్థితి మరింత రసవత్తరంగా మారింది. అయితే తాజాగా సీపీఐ (2 సీట్లు), సీపీఐ(ఎం) (2 సీట్లు) విజయ్‌కు మద్దతు ఇవ్వడానికి సంసిద్ధత వ్యక్తం చేశాయి. వీసీకే (2 సీట్లు) కూడా మద్దతు ఇవ్వడానికి ఇష్టపడుతున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే విజయ్‌కు మ్యాజిక్ ఫిగర్ (118 సీట్లు) సాధించినట్లు అవుతుంది.

మద్దతు ఇచ్చినవారికి మంత్రి పదవులు ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించిన పార్టీలకు మంత్రి పదవులు ఇవ్వాలని టీవీకే అధినేత విజయ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్‌కు 2 మంత్రి పదవులు, సీపీఐ, సీపీఐ (ఎం), వీసీకేకు ఒక్కే మంత్రి పదవి ఇవ్వనున్నట్లు సామాచారం.



గవర్నర్‌ను కలిసిన టీవీకే చీఫ్ విజయ్

టీవీకే చీఫ్ విజయ్ మరోసారి గవర్నర్‌ను కలిశారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌ను కోరారు. ఇప్పటికే విజయ్‌కు మద్దతు ప్రకటించిన కాంగ్రెస్, లెఫ్ట్, వీసీకే పార్టీలు. కాంగ్రెస్, లెఫ్ట్, వీసీకే పార్టీల మద్దతుతో 118కి చేరిన టీవీకే బలం.

తలసీమియా బాధితులకు రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం

- **ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం – అంతర్జాతీయ తలసీమియా దినోత్సవం**
- **పాల్గొన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**

హనుమకొండ, ఆయుధం: తలసీమియా బాధితులకు రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలు అభినందనీయమని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పేర్కొన్నారు. హనుమకొండ రెడ్ క్రాస్ భవన్‌లో ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం – అంతర్జాతీయ తలసీమియా దినోత్సవానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను సందర్శించి అక్కడి వృద్ధులతో ముచ్చటిస్తూ, క్యారం బోర్డు ఆడి వారిలో ఉత్సాహం నింపారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ తలసీమియా వార్డును సందర్శించి చికిత్స పొందుతున్న చిన్నారులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. అంతర్జాతీయ తలసీమియా దినోత్సవం సందర్భంగా తలసీమియా బాధితులకు పండ్లు పంపిణీ చేసి, వారికి రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలను అభినందించారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి డా. కడియం కావ్య పాలకవర్గ సభ్యులు పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 20 మంది కార్మికులకు కిచెన్ సెట్లు, బ్లాంకెట్లను డా. కడియం కావ్య పంపిణీ చేశారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ, హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ రక్తకేంద్రం, తలసీమియా కేంద్రం, జనరిక్ మెడికల్ షాప్ నిర్వహణలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రెడ్ క్రాస్ సేవలు ఎల్లప్పుడూ ముందుంటాయని పేర్కొన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో రక్తకేంద్రాల్లో రక్త కొరత అధికంగా ఉంటుందని, అదే సమయంలో అనేక మంది రోగులు నిరంతరం రక్తంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా తలసీమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న వారికి తరచూ రక్త మార్పిడి అవసరమవుతుందని, వారికి రక్తం కేవలం అవసరం మాత్రమే కాకుండా ప్రాణాధారమని అన్నారు.

ఈ నేపథ్యంలో యువత, సేవా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్త కొరత లేకుండా చూడాలని పిలుపునిచ్చారు. రక్తదానంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హనుమకొండ రెడ్ క్రాస్ పాలకవర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా తాను రెడ్ క్రాస్ సభ్యత్వం స్వీకరించి సంస్థ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయ్ చందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, బిళ్ల రమణా రెడ్డి, భూపాలపల్లి రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు బొద్దిరెడ్డి సతీష్ రెడ్డి, డెమో అశోక్ రెడ్డి, మాతా శిశు సంక్షేమ ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ రుబీనా అఫ్రోజ్, రెడ్ క్రాస్ శాశ్వత సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెంగాల్‌లో సీఎంగా సువేందు అధికారి

జాతీయం, ఆయుధం: భాజపా శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికయ్యారు. కోల్‌కతాలో అమిత్‌షా సమక్షంలో భాజపా శాసనసభాపక్ష సమావేశం జరిగింది. సమావేశం అనంతరం సువేందును బెంగాల్ కొత్త ముఖ్యమంత్రిగా అమిత్ షా ప్రకటించారు. రేపు బెంగాల్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్నట్లు తెలుస్తోంది. ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్‌షా, ఇతర కేంద్ర మంత్రులు హాజరయ్యే అవకాశం ఉంది.

కౌన్సిలర్ స్థాయి నుంచి..

సువేందు 1970 డిసెంబరు 15న తూర్పు మేదినీపుర్‌లోని కర్ములీలో జన్మించారు. ఎంఏ చదివారు. ఆయనది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. తండ్రి సిసిర్ అధికారి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేశారు. యూపీఏ హయాంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రిగానూ ఉన్నారు. సువేందు 1995లో తొలిసారి కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. 1998లో తండ్రితో కలిసి టీఎంసీలో చేరారు. సువేందు 200609 మధ్య రాజకీయాల్లో బాగా ఎదిగారు. 2006లో తొలిసారి కొంటాయి (దక్షిణ) నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచారు. అదే ఏడాది కొంటాయి మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గానూ బాధ్యతలు చేపట్టి.. మూడేళ్లు ఆ పదవిలో కొనసాగారు.

నందిగ్రామ్ ఉద్యమంతో..

సువేందు రాజకీయ జీవితంలో 2007 నాటి నందిగ్రామ్ ఉద్యమానిది ప్రత్యేక పాత్ర. నందిగ్రామ్‌లో 10 వేల ఎకరాలు సమీకరించి సెజ్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రంలోని అప్పటి వామపక్ష ప్రభుత్వం భావించింది. దానికి వ్యతిరేకంగా తృణమూల్ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టింది. వాటిని సువేందు ముందుండి నడిపించారు. నందిగ్రామ్ ఉద్యమం విజయవంతం కావడంతో.. జంగల్ మహల్ (పశ్చిమ మేదినీపుర్, పురూలియా, బాంకురా జిల్లాలు) ప్రాంతానికి తృణమూల్ ఇంఛార్జిగా సువేందును మమత నియమించారు. మమతకు అత్యంత సన్నిహిత నేతల్లో ఒకరిగా ఎదిగారు. సువేందు 2009లో తమ్లుక్ స్థానం లోక్‌సభ ఎంపీగా గెలిచి జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు.

తృణమూల్ గూటిని వీడి..

తృణమూల్ వ్యవస్థాపక సభ్యుడైన ముకుల్ రాయ్ 2017లో పార్టీని వీడారు. అప్పటి నుంచి తృణమూల్‌లో సువేందు ప్రభావం మరింత పెరిగింది. పార్టీలో మమత తర్వాత నంబర్ 2 ఈయనేనని అంతా అనుకున్నారు. అయితే క్రమంగా పరిస్థితులు మారిపోయాయి. మమత తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి పార్టీలో అధిక ప్రాధాన్యమివ్వడం, ఆయనకే పార్టీ పగ్గాలు అప్పగించేలా కనిపించడం సువేందుకు రుచించలేదు. అప్పటికే శారదా కుంభకోణంలో ఆరోపణలు రావడంతో కొంత ఉక్కిరిబిక్కిరయ్యారు. దీంతో 2020 చివర్లో అనూహ్యంగా తృణమూల్‌ను వీడి భాజపాలో చేరారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తరఫున నందిగ్రామ్ నుంచి బరిలోకి దిగిన సువేందు.. మమతను ఓడించారు. అనంతరం రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో భవానీపుర్‌లో మమతను మరోసారి ఓడించి, ఇప్పుడు ఏకంగా బెంగాల్ సీఎంగా బాధ్యతలు చేపట్టడానికి సిద్ధమయ్యారు.

నిబద్ధతతో పనిచేయాలి

- **వరంగల్ పోలీస్ కమిషనర్**

హనుమకొండ, ఆయుధం: నిబద్ధతతో ప్రజలకు సేవలందిస్తూ పోలీస్ శాఖకు పేరు ప్రతిష్ట తీసుకరావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. శాయంపేట నూతన సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన సుధాకర్ రెడ్డి శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ మర్యాద పూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు. దిగువ స్థాయి అధికారులు, సిబ్బంది పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని సీపీ తెలిపారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695